పత్రికాప్రకటన　　　　　　　　　　　　　　　　　　　　కాకినాడ, సెప్టెంబర్ 14, 2018.

## రాష్ట్రంలో ఆర్ అండ్ బి రోడ్లకు మరో 2000 వేల కోట్లు.

– రోడ్లు భవనాల శాఖా మంత్రి సిహెచ్.అయ్యన్నపాత్రుడు.

రాష్ట్రంలో రోడ్లు భవనాలశాఖ రహదారులకు మరో 2 వేల కోట్లు విడుదల చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కోరడం జరిగిందని ఈ నిధులు త్వరలో మంజూరు అవుతాయని రోడ్లు భవనాల శాఖ మంత్రి సిహెచ్.అయ్యన్నపాత్రుడు తెలిపారు. శుక్రవారంనాడు రౌతులపూడిలో రాజవరం నుండి ఎస్.పైడిపాల జంక్షన్ వరకు 14 కోట్ల రూపాయలతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు మంత్రి అయ్యన్నపాత్రుడు , ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్పతో కలిసి శంఖుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్ అండ్ బి శాఖకు విడుదల చేసే అదనపు నిధుల ద్వారా రోడ్డు విస్తరణ పనులు చేపడతామన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఇప్పటికే 44 కోట్ల వ్యయంతో రోడ్డు పనులు జరుగుతున్నాయని వీటికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే అదనపు నిధుల నుండి మరో 25 కోట్లు విడుదల చేస్తామని మంత్రి తెలిపారు. రోడ్లు భవనాల శాఖ రహదారుల భద్రత కోసం టిప్పర్లు వంటి భారీ వాహనాలు రవాణాను నియంత్రించవలసిన అవసరం వుందని అన్నారు. సాధారణంగా రోడ్లు 20 టన్నుల వాహనాల కెపాసిటీకి సరిపోతాయని, గానీ కొన్ని సందర్భాలలో 40 టన్నుల సామర్ధ్యంగల వాహనాలు రవాణా చేయడం మూలంగా రోడ్లు పాడవుతున్నాయని అన్నారు. దీని పై తగు చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఇటీవలి కాలంలో 25 వేల కిలో మీటర్ల మేర సిసి రోడ్లు వేయడం ద్వారా రాష్ట్రం దేశంలోనే ప్రధమ స్థానంలో వుందని అన్నారు. రాష్ట్రంలో 57 లక్షల మందికి ప్రతీ నెలా పింఛను అందించడం జరుగుతుందని, వచ్చే అక్టోబర్ 2వతేదీ నుండి నిరుద్యోగ యువతకు భృతి అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రోజెక్ట్లు సకాలంలో పూర్తి చేయడం ద్వారా రైతులకు సాగునీటి అవసరాలు తీర్చడం జరిగిందని అన్నారు. అదే విధంగా పలు ప్రోజెక్ట్లు పురోగతిలో ఉన్నాయని కూడా మంత్రి తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో వున్నాయని, అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై అరెస్ట్ వారెంటు జారీ చేయడం సబబు కాదని, రాష్ట్ర రైతుల ప్రయోజనాల కోసం పాటుపడిన ముఖ్యమంత్రి పై కేసులు బనాయించడం హేయమైన చర్య అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు శాసన సభ్యులు వరుపుల సుబ్బారావు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జ్యోతుల నవీన్ కుమార్ , ఆర్ అండ్ బి ఎస్ఇ పి.విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. తరువాత తుని- కత్తిపూడి రహదారిలో రెండు కోట్ల తో చేపట్టనున్న కల్వర్టుల నిర్మాణ పనులకు మంత్రి అయ్యన్న పాత్రుడు శంఖుస్థాపన చేశారు.